క్లుప్తంగా

నాణ్యమైన పౌష్టికాహారమే అందించాలి

ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్



నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలోని ఎంపీపీఎస్ (ఏఎన్) పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు ముందుగా ఎంపీపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. వంట గదిని పరిశీలించి, వంట దినుసులు, సామగ్రి పరిశీలించారు. నాణ్యమైన వంట దినుసులను మాత్రమే వినియోగించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారమైన కోడిగ్రుడ్లు, చిక్కీల నాణ్యతను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు.

వెంకట రమణయ్య సేవలు ఎనలేనివి

నాదెండ్ల: గ్రంథాలయాల వ్యవస్థాపకుడు ఐఎస్‌టీ వెంకట రమణయ్య సేవలు ఎనలేనివని లైబ్రేరియన్ రావూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో చైతన్యం, విజ్ఞానం నింపటంలో పుస్తకాల పాత్ర ఎనలేనిదన్నారు. ప్రజలకు పుస్తక పఠనం అలవాటు చేసి తద్వారా వారు జ్ఞానవంతులయ్యేలా దోహదపడ్డారన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

గొరిజవోలులో ఆధార్ సేవలు

నాదెండ్ల: గొరిజవోలు సచివాలయంలో బుధవారం ఆధార్ అప్‌డేట్ సెంటర్ ప్రారంభమైంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆధార్ సేవలందించారు. ఆధార్ అప్‌డేషన్‌కు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరుకాగా, సేవలు మాత్రం నామమాత్రంగానే కొనసాగాయి. సర్వర్‌లో లోపం కారణంగా కేవలం 15 ఆధార్ కార్డులు మాత్రమే అప్‌డేట్ చేయగలిగారు. దీంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు నిరాశతో వెనుదిరిగారు. గురువారం చందవరం గ్రామంలో ఆధార్ సేవలు అందించనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు.

ఎంపీడీవో మృతికి సంతాపం



నరసరావుపేట రూరల్: అకాల మరణం చెందిన నరసాపురం ఎంపీడీవో వెంకట రమణారావుకు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది బుధవారం నివాళులు అర్పించారు. వెంకట రమణారావు కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్‌వీఎస్ రవికాంత్, పరిపాలనాధికారి పుసర్ల శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది శ్యాంప్రసాద్, విజయసుందర్‌దాస్, రజినీ, పంచాయతీ కార్యదర్శులు కె.వి.శివప్రసాద్, శ్రీరామ్, నాని, మస్తాన్‌వలి, రమాదేవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసరావుపేట: విద్యుత్ 11 కేవీ లైన్ల మరమ్మత్తుల కారణంగా గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు బుధవారం తెలిపారు. దీని వలన ప్రకాష్ నగర్‌లోని గంగమ్మగుడి, బాపనయ్యనగర్, ఆంజనేయస్వామి దేవాలయం, కోటేశ్వరనగర్, బిలాల్ మసీదు, తిలక్ స్కూలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: మండలంలోని కనపర్రు, గొరిజవోలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

ఫ్లోరైడ్ నీటిని వాడకండి

యడ్లపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలు భూగర్భ జలాలను సేవించడం వలనే ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారని ఆరోగ్య అధికారులు తెలిపారు. మండలంలోని సందెపూడి, తుర్లపాడు గ్రామాల్లో ఫ్లోరోసిస్ బాధితులకు సహాయక వస్తువుల్ని పంపిణీ చేశారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఫ్లోరైడ్ ముప్పు వల్ల కలిగే నష్టాలను, ఫ్లోరోసిస్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రెండు గ్రామాల్లోని 80 మంది బాధితులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఆటలతోనే పిల్లల్లో మానసిక వికాసం



గణపవరం పోలేరమ్మగుడి ప్రాథమిక పాఠశాలలో ఆటపాటల్లో విద్యార్థులు



బొల్లాపల్లిలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



వి రెడ్డిపాలెంలో తొక్కుడు బిళ్ల ఆడుతున్న విద్యార్థినులు

ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్

రొంపిచర్ల: ఆటలతోనే పిల్లల్లో మానసిక వికాసం పెంపొందుతుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో శిక్షా సప్తాహ్ పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన స్థానిక ఆటల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు అంటే బాల్యం అని, బాల్యం అంటే పిల్లలు అని అన్నారు. పిల్లలు ఆటలు ఆడుతుంటే చూసే వారికి తమ బాల్యంలో ఆడిన ఆటలు గుర్తుకు వస్తాయన్నారు. పోటీల్లో తొక్కుడు బిళ్ల, ఇసుకపల్లా, దాగుడు మూతలు, అష్టాచెమ్మా, కచ్చకాయల ఆట, గట్టుముందు గట్టు వెనక, ఏడు పెంకులు లాంటి ఆటలను పిల్లలచే ఆడించారు. ప్రతి పిల్లవాడు తప్పక ఆడాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన బాలబాలికలు తయారవుతారన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఎన్ఈపీ 2020తో పాటు వారు ఆడిన తొక్కుడుబిళ్ల, అష్టాచెమ్మా లాంటి ఆటలను చూసిన తల్లిదండ్రులు ఎంతగానో సంతోషించారు. వారి బాల్యంలో వారు ఆడిన ఆటలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల నిర్వహణ

చిలకలూరిపేట: కేంద్ర ప్రభుత్వ శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వివిధ పాఠశాలల్లో క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఆటల పోటీల వలన విద్యార్థుల్లో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు. విద్యార్థుల్లో దృఢ చిత్తం, పోటీతత్వం అలవడుతుందని వెల్లడించారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు, పెంపొందించేందుకు పోటీలు ఉపయోగ పడతాయన్నారు.

క్రీడలతో చురుకుదనం, దేహధారుఢ్యం

నాదెండ్ల: జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా బుధవారం మూడోరోజు క్రీడలు, దేహధారుఢ్యం పట్ల చిన్నారుల్లో అవగాహన పెంపొందించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న క్రీడలను ఆసక్తిగా తిలకించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులు చదువుతో పాటూ ఆటపాటలు, క్రీడల్లో రాణించాలని సూచించారు. భారతీయ సంస్కృతికి సంబంధించిన ఆటలకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. తొక్కుడుబిళ్ళ, చెమ్మచెక్క, గట్టుముందు-గట్టువెనుక, కోతికొమ్మచ్చి, చింతపిక్కలు వంటి ఆటలతో సరదాతో పాటూ శారీరక ధారుఢ్యం పెంపొందుతుందన్నారు. చిన్నారులు గెలుపోటములను పట్టించుకోకుండా క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు.

విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం

బొల్లాపల్లి: మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్లో శిక్షా సప్తాహ్‌లో భాగంగా 3వ రోజు విద్యార్థులకు ఆటల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి.పద్మావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా శిక్షా సప్తాహ్‌లో విద్యా వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా తొలి రోజు స్థానిక వనరులను ఉపయోగించుకొని బోధన, విద్య, విజ్ఞాన పరికరాలు తయారు చేయడం, 2వ రోజు గణితంలో ప్రదర్శన నిర్వహించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. 3వ రోజు గ్రామీణ ప్రాంతాల్లో గతంలో ఆడుకున్న ఆటలు తొక్కుడు బిళ్ల, జట్టకాయలాట (అచ్చంగిల్లాలు) , ఏడు పెంకులాట తదితర గత కాలపు సాంప్రదాయపు ఆటలను విద్యార్థులతో ఆడించారు. కనుమరుగవుతున్న గ్రామీణ ప్రాంత ఆటలకు పునరుత్తేజం వచ్చిందని ప్రిన్సిపాల్ తెలిపారు. వీటిపై విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహనతో పాటు మానసిక వికాసం, శారీరక దృఢత్వం అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డి.పాండురంగారావు, పీడీ ఎం.శివానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వనరుడు గుర్రం జాషువా

వినుకొండ ఖ్యాతిని నలుదిశల వ్యాపింపచేశారు

వినుకొండ(నూజెండ్ల): నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 53వ వర్ధంతి ఉత్సవాలు జాషువా సాంస్కృతిక సమైక్య అధ్యక్షతన జాషువా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడుతూ వినుకొండ ఖ్యాతిని నలుదిశల వ్యాపింప చేసిన విశ్వనరుడని కొనియాడారు. కార్యక్రమంలో జాన్‌సుందరరావు, కమలారాం, భాగవతుల రవికుమార్, రెడ్డిబోయిన ప్రసన్న కుమార్, పిడుగు విజయ్, నరసింహారావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా విశ్వనరుడు కవితా విశారద, నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా 53వ వర్ధంతి కార్యక్రమాన్ని అబ్దుల్ కలాం థెరిస్సా సేవా సొసైటీ, ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అన్యాయాలపై అక్షర పోరాటం చేసి చైతన్యాన్ని కల్పించిన సాహిత్య సంఘ సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో చందోలు నాగవాణి, మాచర్ల బుజ్జి, కాకాని అప్పారావు, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



గుర్రం జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన



గుర్రం జాషువా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దురాచారాలను ప్రశ్నించిన మహాకవి

చిలకలూరిపేట: తన పదునైన కవిత్వం ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నించిన మహాకవి గుర్రం జాషువా అని ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. గుర్రం జాషువా వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూఢాచారాలతో నిండిన సమాజంలో ఎన్నో అవమానాలను జాషువా ఎదుర్కొన్నారని తెలిపారు. ఎన్నో కష్టాలను ఓర్చి విద్యాభ్యాసం చేశారని చెప్పారు. అణగారిన ప్రజల ఆత్మగౌరవం కోసం కృషి చేశారని పేర్కొన్నారు. తెలుగువారికి ఎన్నో ఆణిముత్యాల్లాంటి రచనలు అందించిన మహాకవి జాషువాకు పద్మభూషణ్, కళాప్రపూర్ణ, కవి కోకిల, నవయుగ కవి చక్రవర్తి వంటి బిరుదులతో పాటు కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం లభించాయని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్, ఏపీ ప్రైవేట్ కాంపౌండర్స్, నర్సుల అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రముట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్మిక, రైతాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సింగు లెనిన్ బాబు, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు సలికినీడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ వస్తున్నారని అప్రమత్తం

- కార్యాలయాల్లో హడావిడి
- వాటర్‌ప్లాంట్ల నిర్వహణపై దృష్టి పెట్టండి: డీపీవో భాస్కరరెడ్డి
- ప్రసవాల సంఖ్యను పెంచాల్సిందే: డీఎంహెచ్‌వో రవి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో బి.రవి

యడ్లపాడు: జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు యడ్లపాడు మండలం సందర్శిస్తారనేసమాచారం తెలుసుకున్న మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యా, వైద్యఆరోగ్య శాఖల అధికారులు హడావిడిగా కనిపించారు. ఈ నేపథ్యంలో జిల్లాస్థాయి అధికారులైన డీపీవో భాస్కర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో రవి బుధవారం మండల కేంద్రాన్ని సందర్శించారు. అయితే కలెక్టర్ కార్యక్రమం రద్దు కావడంతో తమ శాఖలకు చెందిన అధికారులతో వారు సమీక్షల్ని ఏర్పాటు చేశారు. మిగిలిన వారంతా ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు.

మినరల్ వాటర్‌ప్లాంట్‌లో నీటి పరీక్షలు తప్పనిసరి: డీపీవో

నిబంధనలు పాటించకుంటే మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై చర్యలు తప్పవని పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమావేశం నిర్వహించారు. శాఖపరమైన చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో నడుస్తున్న వాటర్ ప్లాంట్ల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. 15 రోజులకు ఒకసారి తాగునీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలు నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై శ్రీనివాసరావు, ఈవో పీఆర్డీ వరుధిని, కార్యదర్శి శశికళ పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచండి: డీఎంహెచ్‌వో

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్యా అధికారి బి.రవి ఆదేశించారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించిన ఆయన సిబ్బందితో సమీక్షను ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ఆరోగ్య సర్వేలు, రికార్డులు నిర్వహణ తీరుపై ఆరా తీశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు చైతన్య



చైతన్యను అభినందిస్తున్న ప్రిన్సిపల్ చంద్రశేఖర్, పీడీ నాగేశ్వరరావు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి ఉమెన్ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు వాసవీ డిగ్రీ కళాశాల విద్యార్థిని పి.చైతన్య ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ పి.చంద్రశేఖర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ బి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. క్రోసూరులో ఈనెల 23వ తేదీన నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీలలో చైతన్య ప్రతిభ చాటి జట్టుకు ఎంపికైందని వివరించారు. అగస్ట్ 10వ తేదీ నుంచి 12వతేదీ వరకు వినుకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో చైతన్య గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తుందని తెలిపారు. చైతన్యను కళాశాల కార్యదర్శి పి.పవనప్రణతి, వైస్‌ప్రిన్సిపల్ కె.హరికృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

అన్ని గంటలు కరెంటు తీస్తే ఎలా?

- శావల్యాపురంలో ఇబ్బందిపడ్డ వినియోగదారులు
- ముందస్తు సమాచారం ఇవ్వని స్థానిక సిబ్బంది

శావల్యాపురం: మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో అనధికారి విద్యుత్ కోత ధాటికి పలువురు వినియోగదారులు ఇబ్బంది పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, పత్రిక ప్రకటనలు ఇవ్వకుండానే అనధికారంగా శావల్యాపురం విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో అంతరాయం వాటిల్లడంతో వినియోగదారులు ఇక్కట్లు పడ్డారు. ఆయా గ్రామాల్లో ఉన్న మంచినీటి పథకాలు పనిచేయకపోవటం చేత తాగునీటి సమస్యతో అల్లాడిపోయారు. అలాగే వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, తదితర వన్నీ విద్యుత్ అంతరాయం ధాటికి సకాలంలో జరగాల్సిన పనులు కాక ప్రజలు అవస్థలు పడ్డారు.

ఈ విషయంపై మండల విద్యుత్ అధికారి (ఏఈ) జవ్వాజీ నటరాజ్‌ను వివరణ కోరగా వినుకొండ పట్టణ ఏడీఏ విద్యుత్ మరమ్మతులు నిమిత్తం విద్యుత్ లైనులో ముళ్లకంచెలు తొలగించే పనులు చేస్తున్నామని ఇందుకుగాను ఎల్‌సీ 60 నిమిషాలు అడిగినట్లు తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్ పనులు చేయటం జాప్యం కావటం చేత శావల్యాపురం సబ్ స్టేషన్‌కు వచ్చే ప్రధాన లైనుకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయటం వల్ల ఈ అంతరాయం వాటిల్లిందన్నారు. అనధికార విద్యుత్ కోతలు లేవని ఏఈ వెల్లడించారు.

పారిశుద్ధ్య మెరుగుకు కృషి చేయాలి

చిలకలూరిపేట: పారిశుద్ధ్య మెరుగుకు మున్సిపల్ సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు చెప్పారు. పట్టణంలోని సుగాలికాలనీ, శాంతినగర్, పురుషోత్తమపట్నంలలో పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణారావు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలు తనిఖీ

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని విత్తన దుకాణాలను జిల్లా అధికారులు, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విత్తన దుకాణాల్లోని రూ.4.05 లక్షల విలువైన విత్తనాలను తగిన బిల్లులు, స్టాక్ రిస్టర్ నందు వ్యత్యాసాలను గమనించి వారికి స్టాప్ సేల్స్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు విత్తన దుకాణాల్లో తప్పనిసరిగా బిల్లులు తీసుకొని భద్రపరచుకోవాలన్నారు. షాపు యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి
- ఒకటో వార్డులో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ పరిశీలన



ఒకటో వార్డులో శుభ్రం చేసిన కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

నరసరావుపేట: ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలందరూ తమ చుట్టు ఉన్న పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మున్సిపల్ తాగునీటిని కాచి వడపోసి తాగాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి కోరారు. బుధవారం ఒకటో వార్డులోని రామాలయం దేవాలయం పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతాలు మొత్తం కాలువల్లో పూడిక తీసి మందు పిచికారీ చేయాలన్నారు. కాలువల చుట్టూ ఉన్న గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించి నీటి గుంతల్లో ఇసుక పోయించాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో మురికి కాలువల్లో నీరు సాఫీగా పారే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు సంబంధించి ఏమైనా అడ్డంకులు ఉంటే టౌన్ ప్లానింగ్ సిబ్బంది సహాయం ద్వారా వాటి అన్నింటినీ క్లియర్ చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు



విద్యార్థినులతో కలిసి కబడ్డీ ఆడుతున్న వేణుగోపాలరావు

నరసరావుపేట రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని ఉప విద్యాశాఖాధికారి కె. వేణుగోపాలరావు తెలిపారు. విద్యాశిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు బుధవారం శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రతిరోజు గంట పాటు వ్యాయామానికి కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. ఎన్నో గ్రామీణ క్రీడలు కనుమరుగవుతున్నాయని, వాటిని విద్యార్థులకు పరిచయం చేసేందుకు కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి క్రీడలు ఆడి ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. పార్వతి, మండల విద్యాశాఖాధికారి ఎస్.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, షేక్ ఫాతిమా, టి.తిరుపతిరావు, పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ముప్పాళ్లలో మిషన్ శక్తి కార్యక్రమం



మారిన కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో అరుణ

ఈపూరు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ముప్పాళ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ధనలక్ష్మి జూనియర్ కళాశాల, శ్రీ విద్యానికేతన్ ప్రైవేటు స్కూల్ నందు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు గల బాలికలకు మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మారిన కొత్త చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలల రక్షణ, సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ బి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ మారిన కొత్త చట్టాలు అక్రమ రవాణా-1956, బాల్య వివాహ నిరోధక చట్టం-2006, లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం-2012 గురించి అవగాహన కల్పించారు. సీడీపీవో బి. అరుణ మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం 2006లోని వివాహ వయసును తెలియజేస్తూ వివాహం చేయడం వల్ల విధించే శిక్షలు, నష్టాలపై వివరించారు. 14 సంవత్సరాల వరకు బాలలు విద్యాలయాల్లోనే ఉండాలని, వారు బడి బయట పని ప్రదేశాల్లో ఉండరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ల జడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం వి.సాంబనాయక్, ధనలక్ష్మి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు, విద్యానికేతన్ ప్రిన్సిపాల్ డి. చంద్రశేఖర్, సూపర్‌వైజర్ కె.చిన్నమ్మ, ఇన్‌చార్జి మహిళా శిశుసంరక్షణ కార్యకర్తలు డి. తిరుపతమ్మ, డి. మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోకులం బిల్లు ఇప్పించాలంటూ వినతి



వినతిపత్రం అందిస్తున్న మహేష్

నాదెండ్ల: టీడీపీ అధికారంలో ఉన్న 2019లో గోకులం పథకం క్రింద పశువుల షెడ్డు రూ.1.50 లక్షలతో నిర్మించామని, నేటి వరకూ తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన బిల్లులు మంజూరు కాలేదని నందిగం మహేష్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామీణ ఉపాధి హామీపథకం ఏపీడీ సుధాకర్‌కు బుధవారం నాదెండ్ల ఎంపీడీవో కార్యాలయంలో పత్రాన్ని అందించారు. తన తండ్రి నందిగం మస్తాన్‌రావు ఎండుగుంపాలెం గ్రామంలో 2019లో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా షెడ్డు నిర్మించారని, పశు వైద్యాధికారులు బిల్లు మంజూరు చేసిన కొద్దిరోజులకు తన తండ్రి మరణించారని, దీంతో తమకు అందాల్సిన డబ్బులు నిలిచి పోయాయన్నారు. బిల్లులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. దీంతో స్పందించిన ఏపీడీ సుధాకర్ మాట్లాడుతూ, మృతుని మరణ ధృవీకరణ పత్రం, ప్రాపర్ పర్సన్, నిరభ్యంతర లేఖ, జాబ్‌కార్డు, ఆధార్, పాన్‌కార్డు అందించినట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లుల మంజూరుకు కృషి చేస్తామన్నారు.

25 గోకులం షెడ్లు మంజూరు

శావల్యాపురం: పశు సంవర్ధక శాఖ-జాతీయ ఉపాధి పథకం నిధులతో మొదట విడతలో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం నూతనంగా గోకులం షెడ్ల ఏర్పాటుకు 25 యూనిట్లు మంజూరు చేసినట్లు కారుమంచి సెక్టారు పశువైద్యాధికారి సోముల గుణధీర్ బుధవారం తెలిపారు. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదలు, కోళ్లు తదితర వాటిని సంరక్షణ చేసుకునేందుకు గాను రాయితీపై రైతులకు షెడ్లు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. రెండు గేదెల షెడ్ల నిర్మాణానికి రూ, 1.15 వేలు, నాలుగు గేదలు షెడ్డుకు రూ.1.85 వేలు, ఆరు గేదల షెడ్డుకు రూ. 2.35 వేలు రూపాయలు ప్రభుత్వం నిర్మాణ పనులు ఆధారంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇందుకుగాను అర్హత కల్గియున్న రైతు 10 శాతం వాటాధనం చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు నిర్మాణ పనులకు 30 శాతం వాటాధనం రైతులు చెల్లించాలన్నారు. ఆధార్, బ్యాంకు ఖాతా నంబరు, జాబ్ కార్డు, సన్నచిన్న కారు రైతులు అయితే రెవెన్యూ అధికారులు ధ్రువీకరణ పత్రం తదితర వాటితో సంబంధిత గ్రామాల్లోని పశువైద్యశాల్లో సమగ్ర వివరాలతో కూడిన దరఖాస్తులను అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9701678054 సెల్ ఫోను నంబరును సంప్రదించాలన్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లాజట్టుకు సీఆర్ కళాశాల విద్యార్థులు

నాదెండ్ల: సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టులో సీఆర్ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు చక్కటి ప్రతిభతో జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఆగస్టు 10,11,12 తేదీల్లో వినుకొండలో రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. వీటిని పురస్కరించుకుని క్రోసూరులోని సెయింట్ ఆన్స్ స్కూలులో జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 170 మంది క్రీడాకారులు హాజరుకాగా, బాలుర విభాగంలో 18 మంది, బాలికల విభాగంలో 18 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. సీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన యు.నరేంద్ర, సాయి, తరుణ్, ప్రేమ్‌కుమార్, సంజన్, సాగర్, హయాంలు ఎంపిక య్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం సీఆర్ కళాశాల ప్రాంగణంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, పీడీ నాగేంద్రబాబు, లైబ్రేరియన్ నిరంజన్ అభినందించారు.